



వేడుకలో పాల్గొన్న విప్, ఎమ్మెల్యే..

హైదరాబాద్ బంజారా హిల్స్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలో జిల్లాకు చెందిన ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్యమురళీనాయక్ హాజరయ్యారు. ఈ వేడుకలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యానాయక్‌తోపాటు వారు పాల్గొన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

- మహబూబాబాద్, ఆంధ్రజ్యోతి


మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టిన ఆదివాసులు

ఆదివాసీల అభివృద్ధికి
పక్కా ప్రణాళిక

- చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తాం
- గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి
- ములుగు కలెక్టర్ దివాకర
- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 9 : ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. ఆదివాసీల హక్కులు, చట్టాల ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వర కు ర్యాలీని నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా డోలు వాయిద్యాలు, నృత్యాల నడుమ భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం వద్ద కలెక్టర్ దివాకర తోపాటు, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు.


ఐటీడీఏ ఆవరణలో కొమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, పీవో

అనంతరం మండలకేంద్రంలోని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గిరిజన భవన్‌చేపట్టిన ఉత్సవాలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీలంటేనే మానవత్వమని, నమ్మిన వారిపట్ల పూర్తి విధేయతతో ఉంటారని అన్నారు. ఆదివాసీలు తమ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను గిరిజనులకు చేరేలా ఐటీడీఏ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన యువతలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గిరిజనుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.


ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయం : ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయంగా ఐటీడీఏ కృషి చేస్తోందని పీవో చిత్రామిశ్రా అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సకాలంలో గిరిజనులకు అందేలా ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. చట్టాలను పకడ్బందీగా

మిగతా 8వ పేజీలో..

నర్సింహులపేటలో 2001లో ఎస్సీలకు పంచిన భూమి




Statement of Encumbrance on Agricultural land with Survey number 1151/ఆ/2/2 in village of Narsimhulapet Mandal of Narsimhulapet District Mahabubabad

S. No.	Description of property (Survey number, Extent, PPB number)	Transaction date	Name of parties Executants (Ex)/ Claimant (CL)	Nature of Deed/ Transaction ID/ Original Survey No/ Original Extent/ Transacted extent/ Market Value	Tahsildar office/ Document Number/year
1	Pattadar Name బెల్లం రామారావు Khata No : 61287 Survey No : 1151/ఆ/2/2 Extent (Ac. Gts) : 0.3600 Passbook No : T25130023305	05/08/2024	[illegible] (EX) బెల్లం రామారావు(BELLAM RAMARAO) (BU)	Transacted through SALE DEED With transaction No. : 2400530372 Original survey No - 1151/ఆ/2/2 Original Extent (Ac. Gts) - 0.3600 Transacted Extent (Ac. Gts) - 0.3600 Market Value - 242852.00	Tahsildar & Jt. Sub Registrar Office Name - Narsimhulapet 403/2024

Disclaimer – Above Encumbrance details are based on the transaction done in Dharani Portal from 29th Oct 2020 onwards.

అసైన్డ్ భూమి పట్టాలో బెల్లం రామారావు పేరు నమోదైనట్లు చూపుతున్న ఈసీ

'అసైన్డ్'కు ఎసరు?

- తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా తతంగం
- నిబంధనలకు విరుద్ధంగా పట్టా మార్పిడి!
- నర్సింహులపేటలో ఆలస్యంగా వెలుగులోకి..

కార్పొరేట్ చేతుల్లోకి దళితులకు పంచిన భూములు

నర్సింహులపేట, ఆగస్టు 9 : నిరుపేద దళితులకు పంచిన అసైన్డ్ భూములకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎసరు పెట్టినట్టు సమాచారం. దళితుల అవసరాలను ఆసరా చేసుకున్న వ్యాపారులు భూముల ధరలు చూపించి, వాటిని చేజిక్కించుకునేందుకు మండల రెవెన్యూ అధికారులతో తెరచాటు ఒప్పందం కుదుర్చుకొని గోప్యంగా అడుగులు వేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిలో భాగంగానే ఆ దళితుల పేర్లపై ఉన్న అసైన్డ్ భూమి ఈనెల 5న తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా ధరణీలో పట్టా మార్పిడి జరిగిన విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింహులపేటకు చెందిన కొందరు దళితులు సాగు భూమి కోసం 2000 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఆదిత్యనాథ్‌దాస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో వరంగల్ ఎస్సీ కార్పొరేషన్ అధికాకారులు నర్సింహులపేటకు చెందిన సంకెపెల్లి రాఘవరెడ్డి, సంకెపెల్లి నర్సింహారెడ్డిలకు చెందిన సర్వే నెంబరు 1151, 1152, 1153, 1192లో సుమారు 33.22 ఎకరాలు ఒక్కో ఎకరానికి రూ.22 వేలు చొప్పున రూ.7.33 లక్షలు వ్యయంతో కొనుగోలు చేశారు. ఆ భూమిని అసైన్డ్‌గా మార్చి ల్యాండ్ పర్చయ స్కీమ్ (ఎల్‌పీహెచ్)లో అర్హులైన 36మంది దళితులకు 2001 జనవరి 5న 14వ విడత రైతు జన్మభూమి కార్యక్రమంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు పట్టాలు పంపిణీ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

నర్సింహులపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1151, 1152, 1153, 1192లో 33.22 ఎకరాల భూమిని 36 మంది దళితులకు ప్రభుత్వం 2001లో పంపిణీ చేశారు. ఇద్దరు రైతుల నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వం ఆధీనంలో అసైన్డ్‌గా మార్చి దళితులకు కేటాయించిన 33.22 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులతో ఒప్పందం కుదుర్చుకొని తహసీల్దార్ కార్యాలయంలో ధరణీలో పట్టా మార్పిడి చేస్తుండడం విశేషం.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే..

2001లో 14వ విడత రైతు జన్మభూమి కార్యక్రమంలో నర్సింహులపేటకు చెందిన 36 మంది దళితులకు 33.22 ఎకరాల సాగుభూమిని ఉచితంగా పంపిణీ చేశారు. బాధిత దళితుల భూమిపై హక్కుపత్రాలతో పాటు రెవెన్యూ రికార్డులో పేర్లు నమోదయ్యాయి. కానీ, 2018లో ధరణీ వెబ్‌సైట్‌లోకి బాధితులపేర్లు నమోదు కాకపోవడంతో ఇటీవల తొమ్మిది మందికి స్లాట్ బుక్‌చేసి ఈనెల 5న ఎల్లమ్మ, సుధాకర్, వెంకటనర్సమ్మ, ధర్మారపు భద్రమ్మతోపాటు మరో ముగ్గురు పేర్లు మారి బెల్లం రామారావు పేరుపై పట్టా కాలంలోకి మార్చారు. ఈ అసైన్డ్ భూమిలో దశల వారీగా దళితుల పేర్లు మారనున్నట్లు సమాచారం.

అంతా రియల్ మాయ..

నర్సింహులపేటలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయాజాలం యథేచ్ఛగా సాగుతోందనడానికి దళితులకు పంచిన భూమిని కార్పొరేట్ వ్యాపారులకు కట్టబెట్టడమే నిదర్శనం. బాధిత రైతులకు ఆ భూమియే జీవనాధారమైంది. 33.22 ఎకరాలు ఒక్కటే బిట్టు కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుపడింది. భూముల ధరను ఆశ చూపించి బాధిత దళిత రైతులను లొంగదీసుకొని ఒక్కో ఎకరానికి రూ.8.50 లక్షల చొప్పున ధర ఖరారు చేసుకొన్నారు. అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు, రిజిస్ట్రేషన్ అనంతరం మిగతా డబ్బులు అని ఒప్పదంతో తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా రియల్ మాయ జరిగినట్లు స్థానిక ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని దళితులకు పంచిన సాగు భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చెర నుంచి రక్షణ కల్పించాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రభుత్వమే పంపిణీ చేసింది..

నర్సింహులపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1151, 1152, 1153, 1192లో 33.22 ఎకరాల భూమిని ఇద్దరు రైతుల నుంచి కొనుగోలు చేశాం. సాగుభూమిలేని అర్హులైన 33 మంది దళితులకు 2001లో 14వ విడత రైతు జన్మభూమి కార్యక్రమంలో అప్పటి సీఎం చంద్రబాబు పట్టాలు పంపిణీ చేశారు. అది అసైన్డ్ భూమి కిందికే వస్తుంది.

- బండ భిక్షంరెడ్డి, మాజీ సర్పంచ్, నర్సింహులపేట

ప్రభుత్వ భూమి కొనడం, అమ్మడం నేరం..

అసైన్డ్ భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. అలాంటి భూమిని క్రయవిక్రయాలు చేయడం నేరం. ప్రభుత్వం పేదలకు పంచిన భూమి కొనరాదు. నర్సింహులపేట రెవెన్యూ పరిధిలో 33.22 ఎకరాల భూమిని 36 మంది దళితులకు పంపిణీ చేసినమాట వాస్తవం. ఆ భూమి అమ్మిన విషయం తన దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- జి.నర్సింహారావు, ఆర్డీవో, తొర్రూరు




మానుకోట కొత్తబజారులోని నాగేంద్రస్వామి ఆలయంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో
నాగపంచమి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9 : జిల్లా కేంద్రం కొత్తబజారులోని నాగేంద్రస్వామి దేవాలయంలో భక్తులు శుక్రవారం నాగపంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించే పర్వదినాల్లో నాగపంచమి కూడా ఒకటి. శ్రావణ శుక్ల పంచమిని నాగపంచమిగా వ్యవహరిస్తారు. ఆదిశేషుడి కోరిక మేరకు నాగపంచమి రోజున సర్పపూజలు జరిగేలా విష్ణువు అనుగ్రహించాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున నాగులను పూజించిన వారికి కాలసర్ప, గ్రహదోషాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. మానుకోటలోని కొత్తబజారులోని నాగేం ద్రస్వామి దేవాలయంకు వద్దకు ఉదయం మహిళలు అధికసంఖ్యలో చేరుకొని పూలు, పసుపు, కుంకుమలు ఉంచి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గుర్రం బాబా ముఠా అరెస్టు

- ట్రాలీవాహనం సీజ్, రూ.9 వేలు ఇతర వస్తువులు స్వాధీనం
- సేఫ్ జోన్‌కు గుర్రం తరలింపు
- వివరాలు వెల్లడించిన నర్సింహులపేట పోలీసులు

నర్సింహులపేట, ఆగస్టు 9 : మూఢవిశ్వాసాలను ప్రజలపై రుద్దుతూ సొమ్ము చేసుకుంటున్న గుర్రం బాబాతో పాటు ముఠాసభ్యులను నర్సింహులపేట పోలీసులు అరెస్టు చేశారు. వారు వినియోగించిన ట్రాలీవాహనం సీజ్ చేయడంతో పాటు రూ.9 వేల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మహబూ బాబాద్ జిల్లా నర్సింహులపేట ఠాణాలో ఎస్సై గండ్రాతి సతీష్ వివరాలు వెల్లడించారు.

సూర్యాపేట జిల్లాకు చెందిన గుర్రం బాబా పర్వతం లక్ష్మయ్య, మోతే రాములు, పడమంచి సైదులు, సిరిగిరి నరేష్, పడమంచి అశోక్, తూర్పాటి గంగరాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారు కొంతకాలంగా గ్రామాలు, తండాల్లో గుర్రం స్వారీ చేస్తూ మూఢవిశ్వాసాలను ప్రజలపై రుద్దతూ అనారోగ్యంగా ఉన్నవారిని బాగుచేస్తాం, ఇంటివాస్తులు మారుస్తాం, నరదిష్టిని తీసివేస్తామని ప్రజల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నర్సింహులపేట మండలంలోని జయపురంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద గుర్రం బాబా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానిక ప్రజలు ఈనెల 7వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శుక్రవారం పడమటిగూడెంలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. వారు వినియోగించిన ట్రాలీ వాహనాన్ని సీజ్‌చేసి, రూ.9 వేల నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గుర్రంను సేఫ్‌జోన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. శాస్త్రసాంకేతికంగా వృద్ధిచెందుతున్న ఈ రోజుల్లో మూఢనమ్మకాలు నమ్మవద్దన్నారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకన్న, హెడ్ పీసీలు కృష్ణ, సంతోష్, పీసీలు రమేష్, యాకన్న, కృష్ణ ఉన్నారు.


గుర్రం బాబా ముఠాను అరెస్టు చూపుతున్న ఎస్సై సతీష్

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 9 : జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టిజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్‌బీ-4 రామగుండం కమిషనరేట్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.జగదీష్‌ను తొర్రూరు సీఐగా బదిలీ చేశారు. మల్టిజోన్-1లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్‌ను మరిపెడ సీఐగా బదిలీ చేశారు. మరిపెడ సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.హతిరాంను మల్టిజోన్-1కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. మల్టిజోన్-1లో సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.రాజేష్‌ను డోర్నకల్ సీఐగా బదిలీ చేశారు. డోర్నకల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.ఉపేందర్‌రావు మల్టిజోన్-1లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

13 మంది ఎస్సైలు ట్రాన్స్‌ఫర్..

జిల్లాలో 13 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ.. మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరిపెడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తహెర్‌బాబాను సీసీఎస్ మహబూబాబాద్‌కు బదిలీ చేయగా ఖమ్మం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న బొలగాని సతీష్ మరిపెడ ఎస్సైగా, కురవి ఎస్సైగా పని చేస్తున్న బి.గోపి సీసీఎస్ మహబూబాబాద్, నర్సింహులపేట ఎస్సై జి.సతీష్ కురవికి, ఖమ్మం కమిషనరేట్‌లో పని చేస్తున్న ఎం.సురేష్‌ను నర్సింహులపేటకు, దంతాలపల్లిలో పనిచేస్తున్న జి.కరుణాకర్‌ను వీఆర్ మహబూబాబాద్‌కు, తొర్రూరు-2 ఎస్సై పిల్లల రాజును దంతాలపల్లికి, సీరోలు ఎస్సై విజయరామ్ కుమార్‌ను డీఎస్బీ మహబూబాబాద్‌కు, మహబూబాబాద్ టౌన్-1 ఎస్సై సీహెచ్. నగేష్‌ను సీరోలు ఎస్సైగా, సీసీఎస్ మహబూబాబాద్‌లో పని చేస్తున్న జి.ఉమాను డీఎస్బీ మహబూబాబాద్‌కు, వీఆర్ మహబూబాబాద్‌లో పని చేస్తున్న ఎం.వంశీధర్‌ను డీఎస్బీ మహబూబాబాద్‌కు, వీఆర్ మహబూబాబాద్‌లో పని చేస్తున్న దీపికారెడ్డి మహబూబాబాద్ రూరల్ ఎస్సైగా, మహబూబాబాద్ రూరల్ ఎస్సై రియాజ్ పాషాను డీఎస్బీ మహబూబాబాద్‌కు బదిలీ చేశారు.

మాడిపోయిన మిరపనారు

- దుకాణదారుడు ఇచ్చిన మందును పిచికారి చేయడంతోనే దెబ్బ
- 20 మంది రైతులు రూ.4 లక్షల వరకు నష్టం
- కేసముద్రం మండలంలో ఘటన


ధన్నసరిలో మాడిపోయిన మిరపనారు

కేసముద్రం, ఆగస్టు 9 : ధన్నసరి, రాజీవ్‌నగర్ తండాలకు చెందిన సుమారు 20 మంది రైతులు మిరపనారు వేసుకోగా, వేరుకుళ్ల నివారణ కోసం పిచికారి మందు వాడగా మాడిపోయి తీవ్రంగా నష్టపోయారు. శుక్రవారం ఈ విషయాన్ని బాధిత రైతులు విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. ధన్నసరి క్రాస్‌రోడ్డులోని ఓషాపులో కొద్దిరోజుల క్రితం మిరపవిత్తనాలను ఖరీదు చేసిన రైతులు తమ చెల్కల్లో నారు పోసుకున్నారు. వేరు, కాండం కుళ్ల నివారణకు పిచికారి మందుకావాలని అదేషాపులో కొన్నిరోజుల క్రితం అడగగా, ఆ దుకాణం నిర్వాహకుడు ఓ పౌడర్ మందు ఇచ్చినట్లు రైతులు తెలిపారు. దానిని పిచికారి చేయగా, వారం రోజులకు నారుఅంతా మాడిపోయి మొక్కలు అన్నీ చనిపోయాయి. ధన్నసరిలోని ఓ రైతు వద్ద ఈ పిచికారి మందుకొంత మిగలగా, పొరుగున ఉన్న మరో రైతు ఆమందును అడిగి తన నారుమడిలో కొంతభాగానికి పిచికారి చేశారు. సరిగ్గా ఈ మందు పిచికారి చేసిన ప్రాంతంలోని మొక్కలు మాడిపోయిమిగతా ప్రాంతంలోని నారు బాగానే ఉండడం గమనార్హం. ఇలా సుమారు 20 మంది రైతులు రూ.4 లక్షల వరకు పెట్టుబడి నష్టపోయినట్లు బాధిత రైతులు ధన్నసరికి చెందిన గోపాల నర్సింహారెడ్డి, రాజీవ్‌నగర్ తండాకు చెందిన గుగులోత్ యాకూబ్ తెలిపారు. పిచికారి మందులో లోపం ఉండడంతోనే తాము నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఏవో వెంకన్నను వివరణ కోరగా.. పిచికారి మందు శాంపిల్‌ను హైదరాబాద్‌లో పురుగుమందుల నాణ్యతా పరీక్షా కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాడిపోయిన మిరపనారు

న్యాశాయంపేట, ఆగస్టు 9: సఖీ సెంటర్ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. న్యాశాయంపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం సఖీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ సరోజ, టీచర్లు సరళ, సౌందర్య, మహేశ్వరి, అంబప్రసాద్, చంద్రమోహన్, నరసింహరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.



అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం



ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

20 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆగస్టు 20 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ 2023-24 ఏడాది రెగ్యులర్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షల జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థుల పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు https:// kakatiya.ac.in కేయూ వెబ్‌సైట్ చూడలని సూచించారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ జాబ్స్ కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై క్వాలిఫికేషన్స్ ఉన్న 20 నుంచి 40 యేళ్లలోపు వయస్సు ఉన్న యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏజీపీగా సోమయ్య ఏజ్రా శాస్త్రీ నియామకం



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా హైకోర్టు న్యాయవాది హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ లష్కర్‌సింగారానికి చెందిన హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రీ ఆదర్శలా కాలేజీలో ఎల్ఎల్‌బీ చేసి 2018లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం హైకోర్టులో సీనియర్ న్యాయవాది పడాల ప్రవీణ్ కుమార్ దగ్గర ప్రాక్టీసు మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు కొనసాగించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియమితులు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 9: కాజీపేట సిద్ధార్థనగర్‌లోని డి.అమర్‌నాథ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. రూ.29వేల నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధ్రువీకరించారు.

గంజాయి కోసం చైన్‌స్నాచింగ్

జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు ● నలుగురు నిందితుల ఆరెస్టు
బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనం స్వాధీనం ● సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



వివరాలను వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

మట్టెవాడ, ఆగస్టు 9: గంజాయి, జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగు రు నిందితులను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. శుక్రవారం వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. జూలై 30న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తవాడకు చెందిన వడ్లకొండ వనజ మెడలోని బంగారు చైన్‌ను భూపాలపల్లికి చెందిన బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు లాక్కొని స్కూటీపై భూపాలపల్లికి పరారైనట్లు తెలిపారు. అనిల్, బాసిత్‌లకు వరంగల్ ములుగు రోడ్డు వద్ద ప్రైవేట్ హాస్టల్‌లో షెల్టర్ ఇచ్చిన భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన మహ్మద్ షోయబ్ ఖాన్, చైన్‌స్నాచింగ్‌కు ప్లాన్ వేసిన భూపాలపల్లి రాజీవ్ నగర్‌కు చెందిన మహ్మద్ ఫారూక్‌ఖాన్‌లను శుక్రవారం ములుగురోడ్డు వద్ద పక్కా సమాచారంతో అదుపులోకి తీసు కున్నట్టు వెల్లడించారు. వారిని విచారించగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నట్లు తెలిపారు. దాంతో వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు డీసీపీ వెల్లడించారు.

నిందితులు గతంలో భూపాలపల్లి, వైజాగ్, పరకాల, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డరన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దే శంతో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి వరంగల్ కొత్తవాడలో మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డరని తెలిపారు. నిందితులు ఫారూక్‌ఖాన్, మహ్మద్ బాసిత్‌లు గంజాయి స్లగ్లింగ్ చేయడం, గంజాయి సేవించడం బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడిన కేసులలో నిందితులని అనిల్ పరకాల పోలీస్ స్టేషన్ పరిధి చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడని తెలిపారు. వైజాగ్ పరిధిలో గంజాయి కేసులో నిందితుడని డీసీపీ వివరించారు.

చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, భూపాలపల్లి డీఐ నరేశ్, మట్టెవాడ ఎస్సై విఠల్, సీసీఎస్ ఎస్సై సంపత్, పోలీస్ కానిస్టేబుళ్ళు హరికాంత్, మహ్మద్ అలీ, విజయ్‌కాంత్, మధుసూదన్, తిరుపతయ్య, రాజేందర్ ప్రసాద్, హోంగార్డు నాగేశ్వర్‌రావులను డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, అబ్బయ్య, పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ● కేయూలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కేయూలో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో ఆదివాసీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహించారు. కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ , జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపన్నమైనది ఆదివాసీ సంస్కృతి అని చెప్పారు. సంస్కృతి పుట్టింది ఆదివాసీల నుంచే అని చెప్పారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని చెప్పారు. వర్సిటీ ఆదివాసీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయమే కాకుండా ఇతర రంగాల్లో ప్రవేశించి నిపుణులుగా ఎదగాలని అకాంక్షించారు.

విశిష్ట అతిథిగా హాజరైన ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. మన పూర్వీకులు సంప్రదాయ పద్ధతులతో వ్యాధులు, రోగాల నివారణ చేశారని అన్నారు. ఆదివాసీలు విద్యపైన దృష్టి సారించాలని అన్నారు. చదువుకున్న ప్రతీ ఒక్క ఆదివాసీ తోటివారిలో విద్యపై అవగాహన కల్పించి వారిని అభివృద్ధి పథంలోకి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొర మాట్లాడుతూ.. ఆదివాసీలు మూలాలను మరవద్దని అన్నారు. శాస్త్రీయమైంది ఆదివాసీల గోత్ర వ్యవస్థ అని చెప్పారు. భావాలు, ఉద్దేశాలు మంచిగా ఉండాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 90దేశాల్లో ఆదివాసీలున్నాయని చెప్పారు. 30 ఏళ్లుగా ఆదివాసీలు అనేక సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల్లో అవగాహన రావాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెరగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివాసీ యువత సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వాసం ఆనంద్ కుమార్, రవి, కుమారస్వామి, రాజేశ్, సురేందర్, సాయి, తాటి అనిల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

6బి కేటగిరీలో ఆలయాల్లో ఇద్దరు ● 6ఏ కేటగిరీ గుడుల్లో ఆరుగురు

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన బదిలీల్లో మొత్తం 8మంది ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6బీ కెటగిరీకి వచ్చే దేవాలయాల నుంచి ఇద్దరు, రీజినల్ జాయింట్ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6ఏ దేవాలయాల్లో ఆరుగురికి బదిలీలు జరిగాయి. 6బి కేటగిరీ కింద వరంగల్‌లోని కట్టమల్లన్న దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహిపాల్ వరంగల్ ఉర్సు ప్రాంతంలోని నాగేశ్వరాలయానికి, అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్ కట్టమల్లన్న గుడికి బదిలీ అయ్యారు. నాగేశ్వరాలయంలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి (ఈవో) కమల రిటైరయ్యారు. ఆమె స్థానంలో వరంగల్ దుర్గేశ్వరాలయం ఈవో ప్రసాద్‌ను నాగేశ్వరాలయం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా 6ఏ కేటగిరి కింది వేయిస్తంభాలగుడిలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఐనవోలుకు బదిలీ అయ్యారు. ఐనవోలు ఆలయంలో పనిచేసే .జూనియర్ అసిస్టెంట్ మధుకర్ వేయిస్తంబాల గుడికి వచ్చారు. కొత్తకొండ ఆలయంలో పనిచేసే సంజీవరావు ఐనవోలుకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన నారాయణ కొత్తకొండకు వచ్చారు. వరంగల్ బట్టలబజార్‌లోని రామిలింగేశ్వరాలయం ఈవో వెంకట్రావు హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వరాలయానికి, అక్కడ ఈవోగా పనిచేస్తున్న కిషన్‌రావు వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేరాలయానికి స్థాన చలనం జరిగింది.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్ల క్యాంపు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు అర్హత సాధించని విద్యార్థులు సైతం ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఖాళీగా ఉన్న 7 సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. స్పాట్‌కు హాజరయ్యే విద్యార్థులు వారి ఒరిజినల్, జీరాక్స్ సెట్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

వర్సిటీ అనుమతిలేని కళాశాలల్లో చేరొద్దు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: కాకతీయ యూనివర్సిటీ అనుమతి లేకుండా నడుస్తున్న కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందవద్దని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విద్యార్థులకు సూచించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు కళాశాల అఫ్లియేషన్‌ను చూసుకోవాలని, ఆయా వివరాలు వర్సిటీ డీన్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలు పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మార్చుకుని వర్సిటీ అనుబంధం ఉన్నట్లు తప్పుడు సమాచారంతో కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తప్పుడు కళాశాలల్లో చేరిన విద్యార్థులకు వర్సిటీకి ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు.

బయోటెక్నాలజీలో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 9: రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు ప్రసన్నకుమా ర్ టీపీ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం చైతన్య డీమ్డ్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్ ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'మైక్రోబియల్ ప్రొఫైలింగ్ ఆఫ్ జీవామృతం అండ్ అపిమైజేషన్ స్టడీస్ ఆఫ్ ఫర్మెంటేషన్ పారామీటర్స్ ఫర్ ది మాస్ ప్రొడక్షన్ ఆఫ్ బయోఫర్టిలైజర్' అనే అంశంపై చైతన్య టూబీ డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రసన్నకుమార్ పరిశోధన పూర్తి చేశారు. ప్రసన్నకుమార్ టీపీ అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన ప్రసన్నకుమార్ వీసీలు డాక్టర్ సీ.హెచ్.వి పురుషోత్తమ్ రెడ్డి, ప్రొఫెసర్ జి.దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రీసర్చ్ డీన్ ప్రొఫెసర్ టి.క్రిష్టోఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు అభినందించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు9 : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానుకోట జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ సెంటర్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు యాప సీతయ్య సంఘం జెండాను ఎగుర వేసి మాట్లాడారు. ఆదివాసీ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్షుడు పులి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నాగమణి, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, వాసం నాగేశ్వర్‌రావు, అనిల్, వట్టం భాగ్యలక్ష్మి, శంకర్, సోలం నర్సయ్య, వాసం బిక్షమయ్య, పొడెం శ్రీను, వెంకన్న, పెనుక ప్రియాంక, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ చింతారమేష్, కోయ విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగాకరస్పాండెంట్ డోలి సత్యనారా యణ మాట్లాడుతూ ఆదివాసీలు నేటికి అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి, ప్రిన్సిపాల్ వై. కృష్ణప్రసాద్, కేటీ.శంకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి, క్రిష్ణారావు పాల్గొన్నారు.

● సాంక్రియాతండాలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ వెంకన్న, భూక్య హరినాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్యానాయక్, పార్వతి, అశ్వినీ పాల్గొన్నారు.

● మునిసిపల్ 15వ వార్డు పరిధిలో సుందరయ్యనగర్ తండాలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. బోడ సేవ్య రాము, హంక్లీ, భద్రమ్మ, అచ్చాలి, బుజ్జి, కాంతి, జగ్గి పాల్గొన్నారు.



డాక్టర్ చింతా రమేష్, కోయ విద్యార్థులను సన్మానిస్తున్న డోలి సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి



మహబూబాబాద్‌లో ఆదివాసీ సంఘం జెండాను ఎగుర వేస్తున్న యాప సీతయ్య

వివిధ మండలాల్లో..

● సంద్రాలగూడెంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదివాసీ యోధుడు కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేసముద్రం సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఫైండ్ల యాకయ్య, గలిగే పెఎంటయ్య, కొమురయ్య, వెంకన్న, కృష్ణ, కన్నయ్య, సురేష్, మమత, భద్రమ్మ పాల్గొన్నారు.

● సింగారం శివారు ఇస్లావత్ తండాలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘం జెండాను ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్, మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్‌నాయక్ ఆవిష్కరించారు. బానోత్ వెంకటేష్, ఇస్లావత్ కేశ్య, నూనావత్ కిషన్, శ్రీధర్, జానీ, రావూజా, పాల్గొన్నారు.

● గార్ల మండలంలోని సీతంపేట, శేరిపుర గ్రామాల్లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు తమ జెండాలు ఎగరవేసి స్వీట్లు పంపిణీ చేయగా బీజేపీ రాష్ట్ర నాయకులు యాప సీతయ్య, సీతంపేట మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, రమణయ్య, వెంకన్న, నాగరాజు, రాముదొర, బాలకృష్ణదొర, రవి, శ్రీను, వెంకన్న రాంబాబు, అభి, స్రవంతి పాల్గొన్నారు.

● డోర్నకల్ మండలం బూరుగుపాడులో నిర్వహించిన వేడుకలను పురస్కరించుకొని కొమురంభీమ్, మద్దిరాంచంద్రయ్య, చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు జిల్లా నాయకులు దబ్బ శ్రీను, వెంకన్న, చిర్ర శ్రీను, అజయ్‌కుమయార్, తిరుమల్‌రావు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లూరి గంగాదర్, వంకాయలపాటి రామారావు, రాంరెడ్డి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, కడియాల ఉపేందర్, తోట అప్పారావు, చిత్తూరి రామయ్య, అనగాని శ్రీను పాల్గొన్నారు. ముల్కలపల్లి జడ్పీ హై స్కూల్‌లో ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం రుక్మాంగధరారావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● కొత్తగూడలోని గాంధీనగర్ నుంచి ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కొమురంభీమ్ విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహం వద్ద ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. కొమురంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించగా ఏటీడీవో భాస్కర్‌రావు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూణెం సందీప్, ప్రజాసంఘాల నాయకులు కుంజ నర్సింగరావు, రాజేష్, భాస్కర్, సారయ్య, నరేష్ పాల్గొన్నారు. న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో కొమురంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ జిల్లా నాయకులు వెంకటన్న, శ్రీశైలం, పాల్గొన్నారు.

● గూడూరు, మచ్చర్ల, దామరవంచ, మట్టేవాడ, బొద్దుగొండ, కొల్లాపురం, జగన్నాయకులగూడెం గ్రామాల్లో ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు నిర్వహించారు. కొమురంభీమ్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పొడుగు కృష్ణమూర్తి, ఈసం సుధాకర్, బత్తుల శ్రీనివాస్, ముయ్యబోయిన వెంకన్న, దారం స్వామి, పూనెం సమ్మయ్య పాక నర్సయ్య పాల్గొన్నారు.

బియ్యం లారీ పట్టివేత

గూడూరు, ఆగస్టు 9 : మండలకేంద్రంలోని గూడూరు-మహబూబాబాద్ కేంద్రంలోని గూడూరు- మహబూబాబాద్ 365 జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఎస్సై గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ములుగు జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామకు బియ్యం లారీ వెళుతోంది. ఈ క్రమంలో లారీని తనిఖీ చేయగా లారీడ్రైవర్ అందులో నూకలు ఉన్నాయని ఒక్క మాట, ముక్కిపోయిన బియ్యం ఉన్నాయని పొంతన లేని సమాధానం చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. పోలీసులు లారీని పరిశీలిస్తే బియ్యం ఉన్నట్టు నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఈ బియ్యం రేషన్ బియ్యమా - మామూలు బియ్యమా తెలియాల్సి ఉంది. ఈ బియ్యాన్ని నిర్ధారించేందుకు సివిల్ సప్లయి అధికారుల సహకారం కోరినట్లు తెలిసింది. ఎస్సై గిరిధర్‌రెడ్డిని వివరణ కోరగా వాహనాల తనిఖీలో భాగంగా లారీని తనిఖీ చేయగా అందులో బియ్యం ఉన్నాయని తెలిపారు. రేషన్ బియ్యం అని తేలితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

ఒకరిపై దాడి : కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 9 : సీత్లాతండాకు సురేష్ అదే తండాకు చెందిన మరో వ్యక్తిపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సీత్లాతండాకు చెందిన అజ్మీర సురేష్ అతని సమీప బంధువైన అజ్మీర అనిల్ కొన్నిరోజుల క్రితం సురేష్ వద్ద నుంచి రూ.3 వేలు చేతిబదులు తీసుకున్నాడు. ఆ డబ్బుల విషయంలో ఇరువురు ఘర్షణ పడడంతో సురేష్ అనిల్‌పై గడ్డపారతో తలపై దాడి చేయడంతో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనిల్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

• మానుకోట టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని మహబూబాబాద్ టౌన్ సీఐపెండ్యాల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాల బారిన పడి అనేక మంది అకౌంట్లనుంచి డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదుచేయాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్య ఉంటే 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం ఎస్సై సునంద, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్‌లో సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న దేవేందర్

గ్రామాభివృద్ధికి రూ.20వేల విరాళం

మరిపెడ, ఆగస్టు 9 : అబ్బాయిపాలెం గ్రామాభివృద్ధికి జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి శుక్రవారం రూ.20 వేలు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పీఎస్ స్కూల్లో మొక్కలు నాటి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహంతో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం జీపీలను నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. గ్రామాల మౌళిక వసతులకు పంచాయతీ కార్యదర్శులు అష్టకష్టాలు పడుతున్నరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్, ఏపీవో మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, ఎఫ్ఏ రవి, కారోబార్ యాదగిరి తదితరులు ఉన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కాంగ్రెస్ జిల్లా నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి

12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 9 : రాష్ట్రంలో మాదిగ, ఉప కులాలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు పోరాటం చేస్తున్న రిజర్వేషన్లపై అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. జనాభా లెక్కల ప్రకారం మాదిగల ఉపకులాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నరేష్, మంద శశికుమార్, శ్రీకాంత్, మహేష్, సిద్దు, చింటు, అరుణ్ పాల్గొన్నారు.

బలపాలలో ఆదివాసీ దినోత్సవం

కురవి, ఆగస్టు 9 : బలపాలలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆదివాసీ దినోత్సవంలో రాష్ట్ర నాయకులు మాలోతు కిషన్, బానోత్ సీతారాం, దేవానాయక్, రాజా, వెంకన్న, లింగన్న, మంగు, అచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● కురవిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో హెచ్ఎం డీసీఎస్ శర్మ, వార్డెన్ పద్మ, ఉపాధ్యాయులు వెంకన్న, భద్రు, అనిల్, రవి, మంగీలాల్, బలరాజు, ధర్మా, గోవర్ధన్, శ్రీను, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

డోర్నకల్, ఆగస్టు 9 : మునిసిపల్ కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేపట్టి ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బియ్యం నిల్వ చేసిన శ్రీనివాస్, సుశీల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెల మృత్యువాత

కురవి, ఆగస్టు 9 : తట్టుపల్లిలో వీధి కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి చెందాయి. శుక్రవారం రోడ్డుపై వెళ్తున్న గొర్రెలపై ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేయడంతో నూకల లింగయ్యకు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి.

'సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి'

తొర్రూరు, ఆగస్టు 9 : తొర్రూరు డివిజన్ కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ డివిజన్ కేంద్రం ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా ఎస్‌టీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు లేక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూ క్రయవిక్రయాలకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. తొర్రూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే 10 మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, ప్రజాప్రతినిధులు స్పందించి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్, రూరల్ అధ్యక్షులు రవిబాబు, పులేందర్, సాయిముఖేష్, యాకయ్య, సురేష్, యాకన్న, రవీందర్, రాంమూర్తి, గణేష్ తదితరులు ఉన్నారు.

'అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి'

పెద్దవంగర, జూలై 9 : అపరిచితులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉపేందర్ అన్నారు. శుక్రవారం చిన్నవంగర కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు డయల్ 100 సేవలపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు ఆత్మస్థైర్యంతో ఉండాలని, ఆత్మవిశ్వాసమే ఆపద నుంచి రక్షిస్తుందన్నారు. విద్యార్థులు, మహిళలు ఒంటరిగా వెళ్తునప్పుడు అపరిచిత వ్యక్తుల కదలికలను గమనించాలన్నారు. అంతేకాకుండా వారి వ్యవహారశైలి అనుమానాస్పదంగా కనిపించినా సమయస్ఫూర్తిని ప్రదర్శించి వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత : ఎంపీడీవో

మరిపెడ రూరల్, ఆగస్టు 9 : పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ ఇంట్లో మొక్కలు పెంచుకోవాలని ఎంపీడీవో విజయ అన్నారు. శుక్రవారం మండలంలోని అబ్బాయిపాలెం ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మొక్కలు నాటి సచ్ఛమైన గాలిని ఆస్వాదించాలని కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి గ్రామాభివృద్ధికి రూ.20వేలను గ్రామ కార్యదర్శి లక్ష్మికి అందించారు. పాఠశాల హెచ్ఎం శారద, టీచర్ రుబీనా, అంగవాడీ టీచర్లు లక్ష్మీకాంత, సత్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, కారోబార్ యాదగిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగారం ఇన్‌చార్జ్ రేంజ్ అధికారిగా శ్రీనివాసన్

గూడూరు, ఆగస్టు 9 : గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని అప్పరాజుపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసన్‌కు గంగారం అటవీశాఖ ఇన్‌చార్జ్ రేంజ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సీసీఎఫ్ భీమానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గంగారం ఇంచార్జ్ రేంజ్ అధికారిగా బాధ్యతలు అప్పగించిన భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌వో విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశాన్ని కాపాడుకుందాం : సీఐటీయూ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 9 : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతూ నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిలా పడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, కుర్ర మహేష్, బత్తుల వెంకన్న, రవి, హరి, సారయ్య, వెంకటనారాయణ, హేమా, బాలు, శ్రీను, క్రాంతి, నాగమ్మ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు

• నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు

నెల్లికుదురు, ఆగస్టు 9 : గ్రామాలలో ఆర్ఎంపీలు అర్హత, పరిమితికి మించి వైద్యం చేయరాదని ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రగతి పబ్లిక్‌స్కూల్ ఆవరణంలో ఆర్ఎంపీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు రోగులకు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని సూచించారు. భ్రూణ హత్యలను ప్రోత్సహించవద్దన్నారు. అవాంచనీయ సంఘటన చోటు చేసుకుంటే చట్టపరమైన చర్యల తప్పవన్నారు. గ్రామస్థులు అనారోగ్యానికి గురైతే పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు జాహంర్‌పాష వివిధ గ్రామాల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి న్యాయం చేయాలి

● టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9 : ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యంతో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతి కోల్పోయిన సౌభాగ్యకు న్యాయం చేయాలని టీఎస్-యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు సీనియారిటీ ప్రకారం లిస్టు తయారు చేశారన్నారు. తొలుత తయారు చేసిన లిస్టును మార్చి ఎవరికి తెలియనీయకుండా ఒక సబ్జెక్టులో ఉన్నవారిని మరో సబ్జెక్టులోనికి మారుస్తున్నపుడు కనీసం ఆ సబ్జెక్టులో ఎవరు సీనియర్ అని గుర్తించలేదన్నారు. డీఈవో తన ఇష్టం వచ్చినట్లు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఫిజికల్ సైన్స్ లిస్టులోని ఇద్దరు ఉపాధ్యాయులను మార్చారని ఆరోపించారు. అయితే డీఈవో కార్యాలయంలో మళ్లీ అవేతప్పులు పునరావృతం కావడంతో ఉపాధ్యాయురాలికి పదోన్నతి రాలేదని, ఆమెకు పదోన్నతిని కల్పించి న్యాయం చేసి, డీఈవోను బాధ్యతల నుంచి తప్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్కె యాకూబ్, సంజీవ, ప్రవీణ్‌కుమార్, మంద వెంకట్, ప్రసాద్, బాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచాలి

• జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 9 : ఆయిల్‌పామ్ సాగు ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కారణంగా ఆ సాగును గ్రామగ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ కార్యాల యంలో శుక్రవారం ఆయన ఉద్యాన, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిపెట్టి, ఎకరానికి 50 వేల వరకు మొక్కలు, బిందుసేద్యం, ఎరువు లకు, అంతర్ పంటలకు రాయితీ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. నూతన రైతులను రిజిస్ట్రేషన్ చేసి వారి నుంచి బిందుసేద్యం, మొక్కల రాయితీ మినహా సొమ్మును డీడీ రూపంలో తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యాన అధికారులు శాంతిప్రియ, శాంతిప్రియదర్శిని, అధికారులు వెంకన్న, రాజయ్య, ఆయిల్‌ఫెడ్ అధికారులు రంజిత్, కరుణాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 9 : మహబూబాబాద్ పాత బజారులోని పలు కాలనీల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ ఏరియా, స్టేషన్‌రోడ్, హస్తీనాపురం, బస్టాండ్‌రోడ్, రాంచంద్రాపురం కాలనీ, నర్సంపేట బైపాస్, గాయత్రిగుట్ట, ఏటిగడ్డతండా, ఎన్టీఆర్‌స్టేడియం రోడ్‌తో పాటు పలు కాలనీల్లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

● తొర్రూరు : తొర్రూరు విద్యుత్ డీఈ కార్యాలయ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం లైన్ల నిర్వహణ, సబ్‌స్టేషన్ మెయింటనెన్స్‌లో భాగంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తొర్రూరు, హరిపిరాల, చెర్ల పాలెం, వడ్డెకొత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

● మరిపెడ : మరిపెడ సబ్ డివిజన్ పరిధిలోని ఉల్లెపల్లి, తానంచర్ల, ఎల్లంపేట, గిరిపురం, నర్సింహులపేట, కౌసల్యదేవిపల్లి సబ్‌స్టేషన్ల రిపేరు ఉన్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మరిపెడ ఏడీఈ లోకేనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీటి పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కేసముద్రం, ఆగస్టు 9 : మండలంలోని కల్వల ఉన్నత పాఠశాలలో శుక్రవారం కేసముద్రం లయన్స్‌క్లబ్ సభ్యుడు సట్ల శివభరత్ సతీమణి కావ్య పుట్టినరోజు సందర్భంగా రూ.20 వేలు వెచ్చించి 180 మంది విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బండారు నరేందర్ మాట్లాడుతూ పుట్టినరోజును పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రావుల నవీన్‌రెడ్డి, పాస్ట్ జడ్‌సీలు చందా గోపి, యర్రం శ్రీరాములు, చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, పాస్ట్ ప్రెసిడెంట్లు బోగోజు నాగేశ్వరాచారి, బెజ్జం ప్రేమ్‌కుమార్, లక్కాకుల సత్యనారాయణ, రాపోలు శ్రీనివాస్, చింత కరుణాకర్, పీడీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక భూమిని ఆక్రమించారని తహసీల్దార్ కార్యాలయ ముట్టడి

ఇనుగుర్తి, ఆగస్టు 9 : మండల కేంద్రంలోని దళితుల శ్మశాన వాటిక భూమిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని శుక్రవారం ఇనుగుర్తికి చెందిన దళితులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు గుజ్జునూరి బాబురావు మాట్లాడారు. గత 200 ఏళ్ల క్రితం సర్వే నెంబర్ 512లో 1.20 గుంటల భూమిని గ్రామానికి చెందిన వద్దిరాజు సోదరులు, ఆకుల రామయ్యలు నాడు దళితులకు విరాళంగా ఇచ్చారని చెప్పారు. మాజీ సర్పంచ్ గుజ్జునూరి బొందయ్య తన మనువడిపేరుపై పట్టాను చేయించుకున్నాడని ఆరోపించారు. భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా, సమాధులను తొలగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా దళితుల శ్మశాన వాటిక భూమిని దళితులకు చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయం లో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. బూర ఐలయ్య, మహంకాళి యాకయ్య, వెంకన్న, ఇస్తారి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా మురళీధర్

నెహ్రూసెంటర్, ఆగస్టు 9 :మానుకోట ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వోగా మురళీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందించారు. మహబూబాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వోగా పనిచేసిన కళావతిబాయి ఇటీవల జరిగిన బదిలీల్లో తన రెగ్యులర్ స్థానమైన ఖమ్మం జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవోగా వెళ్లారు. ఆమె స్థానంలో తొర్రూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోగా పనిచేస్తున్న మురళీధర్‌ను శుక్రవారం మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వోగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదివాసీల అభివృద్ధికి పక్కా ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

అమలు చేస్తూ గిరిజనుల హక్కులను కాపాడుతామన్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని ప్రజలకు పోలీసులు అండగా ఉంటారన్నారు. సమస్య లుంటే నేరుగా తమను సంప్రదించాలని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. వేడుకల్లో ఆయా పాఠశాల విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఐటీడీఏ పీవోలు నృత్యాలు చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు పోడెం బాబు, చింత కృష్ణ, పులిసె బాల కృష్ణ, మైపతి సంతోష్, గొప్ప వీరయ్య, పోడెం రత్నం, డీడీ పోచం, ఈఈ వీరభద్రం, ఎస్‌వో రాజ్ కుమార్, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.